క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత

దామెర : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం(దొడ్డు) పట్టుకున్న సంఘటన మండలకేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ తెలిపిన కథనం ప్రకారం.. మండలకేంద్రంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు ఆటోలు పోలీసులను చూసి పారిపోతుండగా వారినికి పట్టుకొని విచారించారు. కాగా హసన్‌పర్తి మండలం జయగిరి గ్రామానికి చెందిన పల్లెపు జంపయ్య, సాయిలు దామెర మండలకేంద్రంలో పలువురి వద్ద నుంచి రేషన్ దొడ్డు బియ్యం కొనుగోలు చేసి విక్రయించేందుకు వస్తున్నట్లు వారు ఒప్పుకున్నారు. రెండు ఆటోల్లో 4.50 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో బియ్యాన్ని, ఆటోలను సీజ్ చేసి జంపయ్య, సాయిలుపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

దివ్యాంగుల ఆశ్రమంలో అన్నదానం

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన కందగట్ల సమ్మయ్య 16వ వర్ధంతి సందర్భంగా సమ్మయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు రాజేందర్, సాంబయ్య, రవి, సురేష్ శనివారం హనుమకొండలోని అతిథి మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా తండ్రి జ్ఞాపకార్థం మానసిక వికలాంగుల ఆశ్రమంలో అన్నదానం చేయడం సంతోషకరంగా ఉందన్నారు.

పిడుగుపాటుతో ఆవు మృతి

వేలేరు : పిడుగుపాటుతో పాడి ఆవు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. బాధితుడు బొమ్మరబోయిన మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం మధ్యాహ్నం తన వ్యవసాయ పొలం వద్ద ఆవును కట్టేసి పనులు చేసుకుంటుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి పిడుగు పడడంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ.65 వేలు ఉంటుందని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

రేపు 'భూ భారతి'పై అవగాహన

శాయంపేట : మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఈ నెల 21 రైతులకు భూ భారతి పోర్టల్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. రైతులు, స్థానికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట ఆర్ఐ రమేష్ ఖన్నా, కార్యదర్శి రత్నాకర్ ఉన్నారు.

పరకాలలో రన్‌ఫర్ జీసస్




పరకాల: రన్ ఫర్ జీసస్ కార్యక్రమం పట్టణంలో క్రైస్తవులు ఉత్సాహంగా జరుపుకున్నారు. శనివారం వ్యవసాయ మార్కెట్ నుంచి ఆర్టీసీ డిపో వరకు నిర్వహించిన రన్‌ఫర్ జీసస్ కార్యక్రమంలో క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పరకాలలోని చర్చిల పాదర్లు, క్రైస్తవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ సెంటిమెంట్‌ను రగిలించడానికే సభ

ఆత్మకూరు: ప్రజల్లో మళ్లీ తెలంగాణ సెంటిమెంట్‌ను రగిలించడానికే ఎల్కతుర్తి బీఆర్ఎస్ సభ అని మాజీ సొసైటీ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్ అన్నారు. మండలకేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ఆవిర్భవించి రెండేళ్లు పూర్తయితే రజతోత్సవాలు ఎలా జరుపుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ అభివృద్ధిని బీఆర్ఎస్ నాయకులు ఓర్చుకోవడం లేదన్నారు.

పోగొట్టుకున్న బ్యాగు అందజేత



శాయంపేట : మండల కేంద్రానికి చెందిన ఐరబోయిన రమేశ్‌కు సోమవారం రాత్రి హ్యాండ్ బ్యాగు దొరకగా ఆ బ్యాగును పోలీసుల సమక్షంలో పోగొట్టుకున్న మహిళకు అప్పగించారు. మహిళ స్కూటీపై సోషల్ వెల్ఫేర్ నుంచి ఇంటికి వస్తున్న క్రమంలో స్కూటీపై నుంచి రోడ్డు పక్కన బ్యాగు పడిపోయింది. రమేష్ మాం శాయంపేటకు వస్తుండగా ఉన్న బ్యాగును చూసి స్టేషన్‌లో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణ్, కానిస్టేబుల్ రాజుకు అప్పగించారు. మహిళకు పోలీసులు ఆ బ్యాగును అప్పగించారు. దీంతో పోలీసులకు ఆమె కృతజ్ఞతలు తెలిపింది. బ్యాగులో సెల్‌ఫోన్, నగదు, ఐడీ కార్డ్స్ ఉన్నాయి. దొరికిన బ్యాగును అప్పగించిన రమేష్‌ను ఎస్సై పరమేష్ అభినందించారు.

కళాశాల ఏర్పాటయ్యేనా?

- వేలేరులో జూనియర్ కాలేజీ లేక ఉన్నత విద్యకు దూరమవుతున్న విద్యార్థులు
- రోజువారీ ఖర్చులు భరించలేక దూరప్రాంతాలకు వెళ్లలేని దుస్థితి



వేలేరులోని పాఠశాలలో కాలేజీ ఏర్పాటుకు అనువైన భవనం

వేలేరు : మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ లేకపోవడంతో పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. మండలంలోని పదో తరగతి పాసైన విద్యార్థులు కళాశాల విద్య కోసం ఇక్కడి నుంచి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. మారుమూల గ్రామాలు, గిరిజన తండాల విద్యార్థులు ఆర్థికంగా లేకపోవడంతో రోజువారి ఖర్చులను భరించలేక చదువును మధ్యలోనే మానేస్తున్నారు. గత ప్రభుత్వం 2016లో వేలేరును నూతన మండలంగా ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి మండలంలో జూనియర్ కాలేజీ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలు, పలు ప్రైవేట్ పాఠశాలల నుంచి సుమారు 282 మంది విద్యార్థులు ఈ సంవత్సరం పదో తరగతి వార్షిక పరీక్షలు రాశారు. పదిలో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు మండలంలోని ఆయా గ్రామాల నుంచి ఇంటర్ చదువుల కోసం సుమారు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న హనుమకొండ, వరంగల్ నగరాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలకు వెళ్తున్నారు.

కళాశాల ఏర్పాటుకు అనువైన భవనం..

మండల కేంద్రంలో ప్రభుత్వం జూనియర్ కళాశాల మంజూరు చేసి తరగతులు ప్రారంభిస్తే వేలేరులోని ప్రభుత్వ పాఠశాల భవనం అనువుగా ఉంటుంది. ప్రస్తుతం ఆ భవనంలోని ఒక్క గదిలో మాత్రమే మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంగా ఉపయోగించుకుంటున్నారు. మిగతా భవనం మొత్తం ఖాళీగానే ఉంది. కాగా మండలంలో ఎస్సీ, ఎస్టీ వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులు అధికంగా ఉంటారు. వీరంతా ఎక్కువగా స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోనే పదో తరగతి వరకు చదువుకుని ఇంటర్మీడియట్, ఇతర ఉన్నత చదువులకు హనుమకొండ, వరంగల్ నగరాల్లోని కళాశాలలకు వెళ్లాల్సి వస్తోంది. స్థానిక ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తే పేద విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుంది.

కళాశాల ఏర్పాటు చేయాలి



వేలేరులో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో కొంతమంది పేద విద్యార్థులు ఇంటర్ చదువుకు దూరం అవుతున్నారు. వరంగల్, హన్మకొండ నగరాల్లోని కాలేజీలకు వెళ్లి వచ్చే ఆర్థిక స్తోమత లేక వ్యవసాయ, కూలీ పనులకు వెళ్తున్నారు. కొంతమంది పిల్లలు వ్యసనాలకు అలవాటు పడుతున్నారు. కాలేజీ ఏర్పాటు చేసే విధంగా చొరవ చూపాలని కోరుతున్నాం.

– జి.సురేశ్, మల్లికుదుర్ల గ్రామస్తుడు

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

- జిల్లా సంక్షేమ అధికారి జయంతి



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న అధికారులు

నడికూడ: పౌష్టికాహారంతోనే ఆరోగ్యం అని జిల్లా సంక్షేమ అధికారి జెట్టి జయంతి అన్నారు. శనివారం మండలంలోని నర్సక్కపల్లె గ్రామంలో 7వ రాష్ట్రీయ పోషణ పక్షం–2025 కార్యక్రమంలో భాగంగా పోషణపక్షం నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్‌లో నిర్వహించే ఆరోగ్య లక్ష్మి, ప్రీస్కూల్, పోషణ స్థితిని మెరుగుపరిచే విధంగా అంగన్‌వాడీ టీచర్లు పని చేయాలని సూచించారు. ఏప్రిల్ 8 నుంచి 22 వరకు ప్రతి గ్రామంలో పోషణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో పరకాల, నడికూడ తహసీల్దార్లు విజయలక్ష్మి, నాగరాజు, ఎంపీడీఓ విమల, సీడీపీఓ స్వాతి, సఖీ అడ్మిన్ హైమావతి, పోషణ అభియాన్ డిస్టిక్ కోఆర్డినేటర్ సుమలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్స్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల గ్రామ కమిటీ అధ్యక్షుడిగా జోగిరెడ్డి



శాయంపేట : మండలంలోని మైలారం గ్రామంలో ఉద్యమకారుల ఫోరం గ్రామ కమిటీని మండల అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి రవీందర్, ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దూదిపాల జోగిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా అరికిల్ల వీరయ్య, ప్రధాన కార్యదర్శులుగా గొర్రె కుమారస్వామి, దూదిపాల రాజిరెడ్డి, కోశాధికారి బొంతల నాగరాజుతో పాటు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పల్లెబోయిన సారయ్య తదితరులు పాల్గొన్నారు.

యోగాపై అవగాహన



పరకాల: విద్యార్థి దశలోనే పిల్లలకు మంచి పోషకాహారంతో పాటు యోగా చాలా అవసరమని పరకాల ప్రభుత్వ యునాని ఆసుపత్రి మెడికల్ అధికారి షాగుప్తా తాహనియా అన్నారు. పోషణ్ పక్వాడా –2025 కార్యక్రమంలో భాగంగా పరకాల పట్టణంలోని బీసీ కాలనీలోని ఉర్దూ మీడియం పాఠశాలలో విద్యార్థులకు యోగా ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యోగా ఇన్‌స్ట్రక్టర్ రఘుపతి, అమూల్య, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే ఇళ్లు మంజూరు

- పరకాల మండల ప్రత్యేక అధికారి డాక్టర్ కె.విజయ్‌భాస్కర్



పరకాల : మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి డాక్టర్ కె.విజయ్‌భాస్కర్

పరకాల: ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విషయంలో ఎలాంటి అవకతవకలు జరుగకుండా అర్హత కలిగిన నిరుపేదలనే ఎంపిక చేయాలని పరకాల మండల ప్రత్యేక అధికారి డాక్టర్ కె.విజయ్‌భాస్కర్ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని అన్ని గ్రామాల ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక, గృహనిర్మాణం చేపట్టడంపై అవగాహన కార్యక్రమాన్ని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విజయ్‌భాస్కర్ మాట్లాడుతూ అర్హత కలిగిన నిరుపేదలకే ఇండ్లు మంజూరు చేయాలని సూచించారు. ప్రతిస్థాయిలో ఇంజనీరింగ్ అధికారులు జియోట్యాగింగ్ ఫొటో క్యాప్చర్ చేయడం జరుగుతుందన్నారు. ఇళ్ల మంజూరు విషయంలో ఎ కూడ దళారులను ఆశ్రయించకూడదని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



నడికూడ: మాట్లాడుతున్న రవీందర్

నడికూడ : రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇవ్వనున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం పంచాయతీ కార్యదర్శులకు, ఇందిరమ్మ కమిటీ మెంబర్స్, స్పెషల్ ఆఫీసర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హౌసింగ్ పీడీ రవీందర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ విమల, ఎంపీఓ రవి పాల్గొన్నారు.


అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు అందేలా చూడాలి

ఆత్మకూరు : అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు అందేలా చూడాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఇందిరమ్మ కమిటీ సభ్యులకు అవగాహన సదస్సు జరిగింది. అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు వస్తే చర్యలు తప్పవన్నారు.

ఈదురు గాలులతో నేలవాలిన పంటలు

వేలేరు : ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొస్తుందనేలోగా వచ్చిన భారీ ఈదురు గాలులతో చేతికందిన పంటలు నేలకొరిగాయి. వరితో పాటు మొక్కజొన్న పంటలు నేలవాలగా, మామిడి కాయలు రాలిపోయాయి. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి పంట చేతికి వచ్చే సమయంలో పంట అంతా నేలకొరగడంతో రైతన్నకు నిరాశే మిగిలింది. ప్రభుత్వం నష్టపోయిన పంటలను పరిశీలించి నష్ట పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

రేపు డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు, ఆయా సంఘాల నాయకులు

ఎల్కతుర్తి : ఈనెల 21న భీమదేవరపల్లి మండలం మాణిక్యాపురం గ్రామంలో డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర నిర్వహించనున్నట్లు అధికారులు, పలు సంఘాల నాయకులు తెలిపారు. భీమదేవరపల్లి మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో శనివారం జేఏసీ, మహిళా సంఘాల ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర వాల్‌పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. కార్యక్రమానికి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ హాజరుకానున్నట్లు తెలిపారు. పలు సంఘాల నాయకులతో పాటు మహిళా సంఘాలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి, భీమదేవరపల్లి మండల జేఏసీ చైర్మన్ డ్యాగల సారయ్య, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీఓ వీరేశం, ఎస్సై సాయిబాబు, ఎంఈఓ సునీతారాణి, రజిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పనిచేసే వారికే పదవులు



దామెర : పార్టీకోసం పనిచేసే వారికే పదవులు వర్తిస్తాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాచం గురుప్రసాద్ అన్నారు. మండలంలోని ల్యాదెళ్లలో మండల కమిటీ ఏర్పాటు కోసం ముఖ్య కార్యకర్తలతో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన కమిటీలో చురుకుగా పనిచేసే వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. పార్టీ బలోపేతం కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు వేల్పుల రాజ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి, నాయకులు పొడాల మధుకర్, నాగరాజు, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలి



సాంస్కృతిక ప్రదర్శనలిస్తున్న విద్యార్థినులు

కమలాపూర్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మక విద్య అందిస్తారని, తల్లిదండ్రులు సహకరించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని హెచ్ఎం వి.వాణి కోరారు. మండలంలోని ఉప్పల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 'మన బడి పిల్లల ప్రతిభోత్సవం' పేరిట శనివారం పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల వార్షిక ప్రగతి నివేదిక చదివి వినిపించారు. అనంతరం సబ్జెక్టుల వారీగా పలు కార్యక్రమాలు నిర్వహించగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ బాల్యంలోనే విద్యార్థుల ప్రతిభా సామర్థ్యాలను గుర్తించడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ బండారి రాధ, గ్రామస్తులు ప్రసాద్, శ్రీనివాస్, సత్యపాల్, శోభ, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



నెహ్రూచంద్ నాయక్‌ను సన్మానిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

ఐనవోలు: కమ్యూనిటీ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన బానోతు నెహ్రూ చంద్ నాయక్, సీహెచ్ఓ ధర్మసాగర్, హనుమకొండ జిల్లా సీహెచ్ఓ మధుసూధన్‌రెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా మండలంలోని కొండపర్తి పీహెచ్‌సీలో శనివారం వారిని ఆస్పత్రి సిబ్బంది శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. హెచ్ఈఓ కత్తి రవీందర్, ఎంపీహెచ్ఎస్ సీహెచ్ మాధవి ఎంపీహెచ్ఎఫ్ కె సత్యవేద, శ్రవంతి, ఎండీ అజీమ్, అంజలి, కల్పన, రాజమణి తదితరులు వారిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

కమీషన్ల కోసం రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- గన్నీ సంచులిచ్చి రవాణాకు అనుమతులివ్వాలి
- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



రైతుతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

కమలాపూర్ : కొనుగోలు కేంద్రాలకు ధాన్యం విక్రయానికి తీసుకొచ్చిన రైతులకు వెంటనే గన్నీ సంచులిచ్చి ట్రాక్టర్ల ద్వారా ధాన్యం రవాణాకు అనుమతివ్వాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని గూడూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పౌర సరఫరాల శాఖ అధికారులు దళారులను అడ్డం పెట్టుకొని లారీ కాంట్రాక్టర్లతో కుమ్మక్కై కమీషన్ల కోసం కక్కుర్తి పడుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కేవలం లారీల ద్వారానే ధాన్యం మిల్లులకు తరలించాలంటున్నారని, ఒక్కో లారీలో కనీసం 10 నుంచి 15 మంది రైతుల ధాన్యం తరలించాల్సి వస్తుందని, అందులో ఏ ఒక్క రైతుకు సంబంధించిన ధాన్యం బాగా లేకున్నా మిగతా రైతులంతా నష్టపోవాల్సి వస్తోందన్నారు. లారీల ద్వారానే ధాన్యం రవాణా చేయాలన్న సాకుతో రైతులకు గన్నీ సంచులివ్వడం లేదని, మండల వ్యాప్తంగా అన్ని కొనుగోలు కేంద్రాల్లో ఇదే పరిస్థితి నెలకొందన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఒక వేళ వర్షం కురిసి ధాన్యం తడిస్తే అందుకు ఎవరూ బాధ్యత వహిస్తారని, ఇవేం రూల్స్ అని ప్రశ్నించారు. తాను ఇక్కడి నుంచే పౌర సరఫరాల శాఖ కమిషనర్‌కు, జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేశానని, వారు టెలీకాన్ఫరెన్స్‌లో ఉన్నామని చెప్పారన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే రైతులకు సరిపడా గన్నీ సంచులు సరఫరా చేసి ట్రాక్టర్ల ద్వారా ధాన్యం తరలించుకునేందుకు అనుమతివ్వాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. అనుమతులు ఇవ్వకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేస్తానని హెచ్చరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సంపత్‌రావు, వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్ సత్యనారాయణరావు, కేడీసీసీబీ డైరెక్టర్ కృష్ణప్రసాద్, మాజీ ప్రజాప్రతినిధులు నవీన్‌కుమార్, లక్ష్మణ్‌రావు, శ్రీనివాస్, నాయకులు చంద్రారెడ్డి, తిరుపతిరావు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

ఈ నెల 27న ఎల్కతుర్తి సమీపంలోని చింతలపల్లి వద్ద జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పిలుపునిచ్చారు. కమలాపూర్ కమ్యూనిటీ హాల్‌లో శనివారం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. లక్షలాది మందితో పార్టీ నిర్వహించే రజతోత్సవ సభ చరిత్రలో నిలిచి పోతుందన్నారు. సభకు మండలం నుంచి వేలాది సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒంటిమామిడిపల్లి స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే



పట్టాలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఐనవోలు : మండలంలోని ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఎంఈఓ పులి ఆనందం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థుల చక్కని భవిష్యత్ కోసం పూర్వ ప్రాథమిక స్థాయిలోనే బలమైన పునాది వేయాలన్నారు. జిల్లాలోనే కాకుండా ఈ పాఠశాల రాష్ట్రస్థాయిలో పేరు మారు మోగుతోందన్నారు. విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్య, పీహెచ్‌డీ లాంటి కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ప్రభుత్వం ఏడాది చివరన అధికారికంగా స్నాతకోత్సవం నిర్వహించి పట్టాల ప్రదానోత్సవం జరుగుతుందన్నారు. దీనికి భిన్నంగా ఒంటిమామిడిపల్లి పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ప్రోత్సాహంతో ఉపాధ్యాయులు, నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ పూర్తి చేసిన విద్యార్థులకు రంగు రంగుల గౌన్లు వేసి యూనివర్సిటీ స్థాయిలో చిన్నారులకు పట్టాల పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పెండ్లి నవీన్, వైస్ చైర్మన్ గోనె రాజు, సభ్యులు కర్ణాకర్, రాజు, అడ్వైజర్ ఎండీ రఫీ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



ఆత్మకూరు: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డి

ఆత్మకూరు : మండలంలోని అగ్రంపహాడ్ గ్రామంలో శ్రీవేంకటేశ్వర గ్రామైక్య సంఘం, కటాక్షపూర్‌లో సాయిశివ గ్రామైక్యసంఘం, బ్రాహ్మణపల్లిలో వెన్నెల గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఈ కేంద్రాలను తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ బీరం సునంద సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, నాయకులు రేవూరి జయపాల్‌రెడ్డి, బోరిగం స్వామి, రమేష్, రాజేందర్, తనుగుల సందీప్ తదితరులు పాల్గొన్నారు.



నడికూడ: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ రాజిరెడ్డి

నడికూడ: మండలంలోని నర్సక్కపల్లె, చర్లపల్లి, నార్లాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి ప్రారంభించారు. అనంతరం రాజిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన సన్న ధాన్యానికి ప్రోత్సాహకంగా క్వింటాల్‌కు రూ. 500 బోనస్ అందజేస్తుంది. మొదటి రకం వరి ధాన్యానికి రూ.2320, రెండో రకానికి రూ.2,300 మద్దతు ధర ఉన్నట్లు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దేవేందర్, మల్లారెడ్డి, ఏపీఎం రమాదేవి, ఏఈఓలు పాల్గొన్నారు.

అభివృద్ధి ఓర్వలేకనే విమర్శలు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వేలేరు : నియోజకవర్గంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కత్తి సంపత్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి అనేక అవినీతి అక్రమాలకు పాల్పడి వేల కోట్లు సంపాదించాడని ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉండి మండలానికి చేసిందేమి లేదని అన్నారు. మండలంలో ఏదైనా అభివృద్ధి పని చేయాలంటే ముందుగా బీఆర్ఎస్ నాయకులకు కమీషన్ ఇస్తేనే పనులను ప్రారంభించే వారని లేకుంటే కాంట్రాక్టర్లను ఇక్కడ పనిచేయకుండా అడ్డుకున్న ఘటనలు అనేకం ఉన్నాయని ఆరోపించారు. ఇనుపరాతి గుట్టల భూముల వ్యవహారంలో బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే కడియం శ్రీహరి విసిరిన సవాల్‌ను బీఆర్ఎస్ నాయకులు ఇప్పటివరకు స్వీకరించలేదని అన్నారు. దళిత నియోజకవర్గంలో రెడ్ల పెత్తనం ఏంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ వైస్‌చైర్మన్ రాంగోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మల్లికార్జున్, రాజిరెడ్డి, మాజీ కూడా డైరెక్టర్ బిల్లా యాదగిరి, మాజీ ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్, మండల యూత్ అధ్యక్షుడు రణధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవనం మంజూరు సంతోషకరం



రవీందర్‌ను శాలువాతో సత్కరిస్తున్న నాయకులు

శాయంపేట : మండల కేంద్రంలో ఎమ్మెల్యే సత్యనారాయణరావు అంబేడ్కర్ భవనాన్ని మంజూరు చేయడం సంతోషకరమని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు తుడుం వెంకటేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారెపల్లి రవీందర్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. వెంకటేష్ మాట్లాడుతూ ఒకప్పుడు నియోజకవర్గ కేంద్రమైనా శాయంపేటలో అంబేడ్కర్ భవనం లేకపోవడం దురదృష్టకరమన్నారు. అంబేడ్కర్ భవన నిర్మాణం వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముఖేష్,భాస్కర్, చిరంజీవి, రజనీకర్, పరమేష్, రంగుబాబు పాల్గొన్నారు.